నమస్తే తెలంగాణ


మహబూబాబాద్

5 | వరంగల్, సోమవారం 20 జనవరి 2025 | MAHABUBABAD


- ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు రైతుల ఇబ్బందులు
- 50 కిలోమీటర్లు ఉన్న కేసముద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలు

మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. 2020 సంవత్స రంలో బీఆర్ఎస్ హయాంలో ప్రపోజల్స్ పంపగా అప్పటి ప్రభుత్వం బురహాన్‌పురం గ్రామ పరిధిలో 9.25 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుంది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలోని కేసముద్రం మార్కెట్‌కు వెళ్లి వ్యయ ప్రయాసలకు గురవుతున్నట్లు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. వెంటనే మరిపెడలో మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నది.

- మరిపెడ, జనవరి 19



బురహాన్‌పురం గ్రామంలో మార్కెట్‌కు కేటాయించిన స్థలం




కేసముద్రం వ్యవసాయ మార్కెట్

2020లోనే బీఆర్ఎస్ హయాంలో స్థల సేకరణ

# ప్రతిపాదనల్లోనే మరిపెడ మార్కెట్

కేసముద్రం, మరిపెడ మండలాల పరిధిలోని గ్రామాలను కలిపి కేసముద్రం మార్కెట్‌ను 1960 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. మరిపెడలో చెక్‌పోస్ట్, సబ్ యార్డ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఏటా లభిస్తున్న ఆదాయంలో మూడో వంతు ఈ చెక్‌పోస్ట్ ద్వారానే వస్తున్నది. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల సరిహద్దు, జాతీయ, రాష్ట్ర రహదారుల కలయికతో వందలాది మంది రాకపోకలతో రద్దీగా ఉండే మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేస్తే అందుబాటులో ఉంటుందని రైతుల నుంచి డిమాండ్ వచ్చింది. వ్యవసాయ ఉత్పత్తులను వేరే ప్రాంతాలకు వెళ్లి విక్రయించాల్సిన పనిలేకుండా, సమయం, ఆర్థికంగా కలిసి వస్తుందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కృషితో 2020 సంవత్సరంలో మరిపెడలో మార్కెట్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపగా, మే 18న అప్పటి ప్రభుత్వం బురహాన్‌పురం గ్రామ పరిధిలో 161/1/2 సర్వే నంబర్లో 9.25 ఎకరాల భూమిని కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21 అక్టోబర్ 2024న మార్కెట్ ఏర్పాటు చేస్తే నియమించాల్సిన ఉద్యోగులు, చేర్చాల్సిన గ్రామాలు, పంట సాగు విస్తీర్ణం, ఆదాయం, వ్యాపారులు, మిల్లులు ఇతరత్రా వ్యవసాయ ఆధారిత పరిశ్రమల వివరాలతో సమగ్ర రిపోర్టు అందజేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ కేసముద్రం మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు.

## నివేదిక సిద్ధం చేస్తున్నాం..

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి ఇప్పటివరకు సబ్ యార్డ్‌గా ఉన్న మరిపెడలో కొత్తగా మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమగ్ర నివేదిక అందించాలని డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్లు కేసముద్రం మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వర రావు చెప్పారు. అందుకోసం నివేదిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

మరిపెడలో ఏర్పాటు చేసిన ఏఎంసీ చెక్‌పోస్టు






సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- గ్రామ సభల్లో ఎమ్మెల్యేను నిలదీయాలని సూచన

దుగ్గొండి, జనవరి19 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తుల పేరుతో కాలయాపన చేస్తున్నదని అన్నారు. ఆత్మీయ భరోసా పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి హామీ కూలీకి రూ. 12,000 ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశాడన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 6.47 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, ప్రజాపాలనలో 18 లక్షలకు పైగా వచ్చిన దరఖాస్తుల్లో ఇరవై శాతం మంది అర్హులకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ అభివృద్ధిని అటకెక్కించాడని, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులను బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను గాలికొదిలి, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేలా పథకాల పేరుతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పక్కకు పెట్టి కులగణన సర్వే వివరాలతో లబ్ధిదారులను ఎంపిక చేయడం ప్రజలను వంచించడమేనన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్న గ్రామసభల్లో సంక్షేమ పథకాలపై అధికారులు, అధికార పార్టీ నాయకులను నిలదీయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, పార్టీ మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు రేవూరి సురేందర్‌రెడ్డి, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, పిండి కుమారస్వామి, సింగతి రాజన్న, నాయకులు ల్యాండె రమేశ్, కామిశెట్టి ప్రశాంత్, గ్రామ పార్టీ అధ్యక్షులు కూస రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచి విద్యుత్ ఆర్టిజన్ల రిలే దీక్షలు

ట్రాన్స్‌కో జోనల్ సీఈకి నోటీసు ఇచ్చిన జేఏసీ నేతలు



సీఈ శ్రీరాంకుమార్‌కు నోటీసు ఇస్తున్న తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నేతలు

హనుమకొండ, జనవరి 19 : తమ పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నేతలు తెలిపారు. ఈ మేరకు ట్రాన్స్‌కో జోనల్ సీఈ శ్రీరాంకుమార్‌కు ఆదివారం టీజీ ట్రాన్స్‌కో వరంగల్ సర్కిల్ జేఏసీ కన్వీనర్ కే వెంకట్ ఆధ్వర్యంలో నోటీసు అందజేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని టీవీఏసీ ఏజేసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం స్పందించడం లేదని జేఏసీ నేతలు తెలిపారు. దీంతో తమ డిమాండ్ల సాధనకు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం నుంచి 24 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్టిజన్లు ములుగు రోడ్డులోని 220 కేవీ విద్యుత్ కేంద్రంలోని ట్రాన్స్‌కో జోనల్ ఆఫీసు ఎదుట దీక్షలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నార్లు.




ఓవరాల్ చాంప్‌గా నిలిచిన ఏఆర్ విభాగం క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝా

# ముగిసిన పోలీసు క్రీడలు

- ఓవరాల్ చాంప్‌గా ఏఆర్ విభాగం
- బహుమతులు అందజేసిన వరంగల్ సీపీ

సుబేదారి, జనవరి 19 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వరంగల్ కమిషనరేట్ పోలీసు వార్షిక క్రీడలు ఆదివారం ముగిశాయి. వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం, పుట్‌బాల్, హైజంప్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా 125 పతకాలు గెలుచుకొని ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగం పోలీసులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. అనంతరం జరిగిన వేడుకల్లో సీపీ అంబర్ కిశోర్‌ఝా గెలుపొందిన పురుష, మహిళా పోలీసులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు మానసికోల్లాసాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని చాటడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బయ్యారంలో ఉక్కు పరిశ్రమపై నీలినీడలు

- మా వల్లకాదని రాష్ట్రానికి లేఖ పంపిన కేంద్ర ఉక్కుశాఖ?
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్టీల్‌ప్లాంట్‌పై కాంగ్రెస్ మౌనం
- విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి భారీ ప్యాకేజీపై సర్వత్రా చర్చ



బయ్యారం గుట్ట

# ఆశలు ఆవిరి

### హామీని నెరవేర్చాల్సిందే..

విభజన చట్టంలో చట్టబద్ధంగా లభించిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీని నెరవేర్చాల్సిందే. బయ్యారం అడవుల్లో నాణ్యమైన ఖనిజం ఉందని సర్వేలు తేల్చి చెప్పినా కేంద్ర ప్రభుత్వం కుంటిసాకులు చెప్పి తప్పించుకోవడం సరికాదు. విశాఖ ఉక్కుకు ప్యాకేజీలు ప్రకటించిన కేంద్రం బయ్యారాన్ని మర్చిపోవడం వివక్షే. నాడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే చట్టబద్ధ హామీ లభించింది. కేంద్రంతో కొట్లాడాల్సిన కాంగ్రెస్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం శోచనీయం. ఎన్నికల సమయంలో పరిశ్రమను ప్రచారాస్త్రంగా వాడుకున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెందుకు మాట్లాడడం లేదో ప్రజలకు చెప్పాలి.

– గౌని ఐలయ్య, ఉక్కు సాధన కమిటీ కన్వీనర్, బయ్యారం





ఇనుప ఖనిజం (ఫైల్)

బయ్యారం, జనవరి 19 : బయ్యారం ఉక్కు పరిశ్రమపై నీలినీడలు కమ్ముకున్నాయి. విశాఖపట్టణంలోని ఉక్కు ఫ్యాక్టరీకి భారీ ప్యాకేజీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై మరోమారు వివక్ష ప్రదర్శించింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో రూ.30వేల కోట్ల తో సెయిల్ ఆధ్వర్యంలో తెలంగాణలో భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్రం పేర్కొంది. రాష్ట్ర అవతరణ అనంతరం కేంద్రం పదేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించిందే తప్ప ఉక్కు పరిశ్రమ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సినంత ఖనిజం బయ్యారం ప్రాంతంలో లేదని, అక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పలుమార్లు ప్రకటన చేయించారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ప్రత్యేక ప్యాకేజీ కింద రూ. 11,440 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో మరోమారు బయ్యారం ఉక్కు పరిశ్రమ చర్చనీయాంశంగా మారింది.



### కావాల్సినంత ఖనిజం..

వాస్తవాలు పరిశీలిస్తే ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 1,41,691 ఎకరాల్లో ఇనుప ఖనిజం విస్తరించి ఉంది. 2014లో బయ్యారం అటవీ ప్రాంతాన్ని సందర్శించిన సెయిల్ ప్రతినిధుల బృందం ఇనుప ఖనిజం లభ్యత, నాణ్యతపై నివేదిక ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఈ విషయమై 2015లో అప్పటి బీఆర్ఎస్ సర్కారు టాస్క్ ఫోర్స్ కమిటీ వేసింది. ఉక్కు తయారీలో ఉపయోగించే 45 శాతం కంటే అధిక నాణ్యత కలిగిన 11 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం నిల్వ ఉందని తేలింది. స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు కావాల్సినంత ఖనిజం ఉందని నాడే స్పష్టమైంది. అయినా కేంద్ర ఉక్కు శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల ఓ లేఖ పంపినట్లు సమాచారం. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే బయ్యారంలో పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. మరో అడుగు ముందుకేసి మహబూబ్‌నగర్ సరిహద్దున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి ముడి ఇనుము తెచ్చుకునే వీలున్నందున అక్కడ కూడా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయొచ్చని, దీనిపై అవసరమైతే సెయిల్‌తో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని కేంద్రం పేర్కొన్నట్లు తెలిసింది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఉక్కు పరిశ్రమ సాధిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేతలు అనంతరం మళ్లీ ఆ ఊసే ఎత్తకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# తిరుగు ప్రయాణ పాట్లు..

- బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు
- హైదరాబాద్ రూట్‌లో పెరిగిన రద్దీ

హనుమకొండ చౌరస్తా, జనవరి 19: సంక్రాంతి పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణంలో ఆదివారం బస్సుల కోసం ప్రజలు పాట్లు పడ్డారు. గంటల తరబడి వేచి చూసి విసిగిపోయారు. వరంగల్ రీజియన్‌లోని పరకాల, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట, హనుమకొండ బస్‌స్టేషన్లు ప్రయాణికులతో నిండిపోయాయి. ప్రధానంగా హనుమకొండలో బస్సుల కోసం పడిగాపులు కాశారు. వరంగల్–హైదరాబాద్ రూట్‌లో జనం రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రాంతాలకు నడుస్తున్న సర్వీసులను రద్దు చేయడంతో అక్కడి ప్రజలు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా ములుగు, ఏటూరునాగారం, భూపాలపల్లి, నర్సంపేట, తొర్రూరు, పాలకుర్తి, ధర్మసాగర్, వరంగల్ సిటీ ప్రయాణికులు బస్సుల కోసం రోడ్ల మీద నిరీక్షించారు.

### హైదరాబాద్ బస్సుల కోసం క్యూ

హనుమకొండ బస్‌స్టేషన్‌లోని హైదరాబాద్ పాయింట్ల వద్ద బస్సుల కోసం జనం క్యూ కట్టారు. సోమవారం విధుల్లో చేరడానికి వేలాదిగా ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఇతర ప్రైవేట్ ఉద్యోగులు హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఒక్క ఆదివారం రోజే రాత్రి 8 గంటల వరకు ఎన్నడూ లేని విధంగా సుమారు 500 ట్రిప్పులు హైదరాబాద్ రూట్‌లో నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇవేకాకుండా హైదరాబాద్ మీదుగా బెంగళూర్, విజయవాడ, తిరుపతి, నెల్లూరు, శ్రీశైలం, మిర్యాలగూడ తదితర దూరప్రాంతాలకు రిజర్వేషన్ బస్సులు నడిపారు. వరంగల్ రీజియన్‌లో ఆర్టీసీ, అద్దె, సిటీ బస్సులు 930 ఉండగా, వీటిలో 254 బస్సులు హైదరాబాద్ రూట్‌కే కేటాయించారు.



బస్సుల కోసం హనుమకొండ బస్టాండ్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

# చార్జీల మోత

- ప్రత్యేక బస్సుల పేరుతో అధిక వసూళ్లు
- టికెట్ ధరల పెంపుతో ప్రయాణికుల ఆగ్రహం
- తొర్రూరులో ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదం

తొర్రూరు, జనవరి 19 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సుల పేరుతో చార్జీల మోత మోగిస్తున్నారు. టికెట్ ధరకు అదనంగా వసూలు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు బస్టాండ్‌లో పండుగకు వచ్చి తిరుగు ప్రయాణమైన ప్రజలు ధరల పెంపుపై ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తొర్రూరు నుంచి ఉప్పల్ ఎక్స్ రోడ్ వరకు పండుగకు ముందు రూ. 290 ఉన్న టికెట్‌ను ఇప్పుడు రూ. 420కు పెంచడంతో ఆగ్రహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూఏటా పండుగల సమయంలో టికెట్ ధరలు పెరగడం సాధారణమైనా, ఈ సారి పెంపు అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంతో ప్రయాణం చేయాలంటే పెద్ద మొత్తంలో ఖర్చవుతున్నదని, తమ సమస్యలను కూడా అధికారులు పట్టించుకోవాలని మండిపడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము పనిచేస్తామని, ప్రయాణికులు తమకు సహకరించాలని ఆర్టీసీ సిబ్బంది కోరారు.

## 660 ప్రత్యేక సర్వీసులు ప్రారంభించాం

సంక్రాంతి పండుగ సందర్భంగా 660 ప్రత్యేక సర్వీసులు ప్రారంభించాం. వరంగల్ రీజియన్ పరిధి నుంచి హైదరాబాద్‌కు ఆదివారం 254 అదనపు సర్వీసులు నడిపాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులు తిప్పుతున్నాం. ఆదివారం కావడంతో ప్రయాణికులు పెరిగారు.

– డీ విజయభాను, ఆర్ఎం

# సూపర్ స్పెషాలిటీలో నిలిచిన శస్త్ర చికిత్సలు

- యంత్రాల లోటు.. నిపుణుల కొరతే కారణం
- హైదరాబాద్‌కు సిఫారసు చేస్తున్న వైద్యులు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు లేక ఇబ్బంది పడుతున్న రోగులు

వరంగల్ చౌరస్తా, జనవరి 19 : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించాలన్న ప్రభుత్వ సంకల్పం నీరుగారిపోతున్నది. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్య సేవలకు వసతుల లేమి ముప్పుగా మారింది. నిరాటంకంగా కొనసాగాల్సిన శస్త్ర చికిత్సలు యంత్ర పరికరాల లోటు, వైద్య నిపుణుల కొరత కారణంగా నిలిచిపోయాయి. పది రకాల సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో న్యూరో సర్జరీ, యూరాలజీకి సంబంధించిన శస్త్ర చికిత్సలతోపాటు గుండె సంబంధిత కార్డియోథొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ (సీటీవీఎస్) సర్జరీలు కొనసాగకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు నెల రోజులుగా చిన్నా చితక ఆపరేషన్లు మాత్రమే నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వచ్చిన వారికి యంత్ర పరికరాలు పని చేయడం లేదంటూ హైదరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌కు సిఫారసు చేస్తున్నారు. సుమారు 10 రోజులుగా ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజల చూపు ప్రభుత్వ వైద్యం వైపునకు మళ్లినా అందుకు తగిన విధంగా ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకుండా, కనీస వసతులు కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరాటంకంగా అన్ని రకాల శస్త్ర చికిత్సలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

